రైతుకు మరింత ‘సహకారం’

- నోములలో పాల సేకరణ కేంద్రం
- ఆరుట్లలో మినీ మార్కెట్ ఏర్పాటు
- పాడి పశువుల కొనుగోలుకు రుణాలు
- దాణా సరఫరా..


నోములలో ఏర్పాటు చేయనున్న పాల సేకరణ కేంద్రం భవనం ఇదే..

మంచాల: రైతు ఆర్థిక పురోగతే లక్ష్యంగా మంచాల ప్రాథమిక రైతు సహకార సంఘం కృషి చేస్తోంది. ఆ దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుతం సంఘంలో 6,087 మంది సభ్యులు ఉన్నారు. ఇప్పటి వరకు 1,855 మంది రైతులకు పంట రుణంగా రూ.10 కోట్ల 256లక్షల 78 వేలు ఇచ్చారు. 888 మందికి రూ.20 కోట్ల 96లక్షల 19 వేలు దీర్ఘ కాలక రుణాలు, ఆభరణాలపై 516 మందికి రూ.6 కోట్ల 58 లక్షల 75 వేలను అందజేశారు. వీటితో పాటు ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తోంది. ఇదిలా ఉండగా.. గతంలో మండలంలో ప్రాథమిక రైతు సహకార సంఘాలు ఆరుట్ల, లోయపల్లి, మంచాల, నోముల నాలుగు ఉండేవి. వాటన్నింటిని కలిపి మంచాల ఒక్కటిగా మార్చారు. లోయపల్లి, నోముల, ఆరుట్ల గ్రామాల్లో నాటి సహకార సంఘాల భవనాలు నిరుపయోగంగా ఉండగా.. లోయపల్లి భవనంలో మాత్రం పశు వైద్యశాలను కొనసాగిస్తున్నారు. నోముల, ఆరుట్ల భవనాలను వరి ధాన్యం కొనుగోలుకు ఉపయోగించే వారు. ప్రస్తుతం ఆయా భవనాల్లో పాల సేకరణ కేంద్రం, మినీ మార్కట్ ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.

మండలంలో నీరు తక్కువ

మంచాల మండలం గుట్టల ప్రాంతం కావడంతో భూగర్భ జలాలు అంతంత మాత్రమేని చెప్పుకోవాలి. చాలీచాలని నీటితో వరిని పండించడం ఇక్కడి కర్షకులకు కష్టంగా మారింది. దీంతో కొందరు ఎక్కువగా కూరగాయలు, ఆకు కూరలను సాగుచేస్తున్నారు. పాడిని నమ్ముకున్నవారు ఉన్నారు. దీని ఆధారంగానే సహకార సంఘం.. రైతుకోసం మినీ కూరగాయల మార్కెట్, పాల సేకరణ కేంద్రం ఏర్పాటు చేయనుంది. ఇందులో భాగంగానే ఈ నెల 28న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి.. ఆరుట్లలో మినీ మార్కెట్, నోములలో పాల సేకరణ కేంద్రాలను ప్రారంభించనున్నారు.

ఆరుట్లలో.. మినీ మార్కెట్

ఆరుట్ల సహకార సంఘం కార్యాలయ ఆవరణలో మినీ మార్కెట్‌ను ఏర్పాటు చేయనున్నారు. దీంతో రైతులకు ఎంతో మేలు జరగనుంది. ఇక్కడే ఆరుట్లతో పాటు చుట్టుపక్కల గ్రామాల రైతులు కూరగాయలు విక్రయించనున్నారు. ఈ విపణిలో రూ.60 లక్షలతో మౌలిక వసతులు కల్పించనున్నారు.

పాల సేకరణ కేంద్రం

నోముల ప్రాథమిక సహకారం సంఘం భవనంలో పాల సేకరణ కేంద్రం ఏర్పాటు చేయనున్నారు. రూ.20 లక్షలతో అందుకు కావాల్సిన సౌకర్యాలను సమకూర్చనున్నారు. అనంతరం పాడి రైతుల నుంచి పాలను సేకరించనున్నారు. ప్రతివారం బిల్లులు చెల్లించనున్నారు. అంతే కాకుండా రైతులకు పాడి పశువుల కొనుగోలుకు రుణాలు ఇవ్వనున్నట్లు సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. పశువులకు దాణా సరఫరా చేయడంతో పాటు.. రైతులకు ఇబ్బంది లేకుండా, వారికి ఇచ్చిన రుణాలకు, పాల సేకరణ ద్వారా వచ్చే డబ్బులను జమచేసుకోనున్నట్లు సమాచారం. ఇలాగే రైతు సంక్షేమం కోసం భవిష్యత్తులో మిగతా గ్రామాల్లో పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేయనున్నామని పాలక వర్గం పేర్కొంది.

రైతులకు మేలు



రైతు సంక్షేమ లక్ష్యంగా ప్రాథమిక రైతు సహకార సంఘం పనిచేస్తోంది. అందులో భాగంగా వారికి మేలు చేసే కార్యక్రమాలను చేపడుతున్నాం. రైతులకు రుణాలు ఇవ్వడంతో పాటు, వాటిని ఎలా సద్వినియోగం చేసుకోవాలి, ఆర్థిక పురోగతి ఎలా సాధించాలో అవగాహన కల్పిస్తున్నాం.

– వెంకటేశ్, డైరెక్టర్, పీఏసీఎస్, మంచాల

అభివృద్ధి కార్యక్రమాలు



మంచాల ప్రాథమిక రైతు సహకారం సంఘం అభివృద్ధికి అందరి సహకారం తీసుకుంటాం. ఎమ్మెల్యే నిధులు, ఎంపీ నిధులు, నాబార్డు నిధులతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. రైతులకు అన్ని విధాలుగా సహకరించి, వారి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తాం.

– హన్మంత్‌రెడ్డి, చైర్మన్, పీఏసీఎస్, మంచాల

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

సీఐ శివప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ

కడ్తాల్: పండుగలను ప్రశాంత వాతవరణంలో జరుపుకోవాలని సీఐ శివప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఉగాది, రంజాన్‌ను పురస్కరించుకుని పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. పండుగలను స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. ఒకరినొకరు గౌరవించుకోవాలని, సోదరభావంతో మెలగాలని కోరారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో పీఎస్ఐ చంద్రశేఖర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మాజీ వైస్ ఎంపీపీ ఆనంద్, బీజేపీ మండల అధ్యక్షుడు మహేశ్ దోనాదుల, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహారెడ్డి, తులసీరాం, వివిధ పార్టీల నాయకులు జహంగీర్ అలీ, హైమద్‌జాని, ఇర్షాద్, మౌలానా జహీరుద్దీన్, మాన్యనాయక్, రెడ్యా తదితరులు ఉన్నారు.

ఏఐతో విద్యాప్రమాణాలు మెరుగు


ఏఐ పాఠాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్

అబ్దుల్లాపూర్‌మెట్: ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్‌తో విద్యాప్రమాణాలు మెరుగు పడతాయని ప్రధానోపాధ్యాయుడు వి.విజయ్ భాస్కర్‌రెడ్డి అన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్(కృత్రిమ మేథ)ను వినియోగిస్తూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యేలా విద్య బోధనకు డీఈఓ ఆదేశించారు. ఈ మేరకు బుధవారం మండల పరిధి మజీద్‌పూర్ ప్రభుత్వం పాఠశాలలో ఏఐ ల్యాబ్‌ను ప్రధానోపాధ్యాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు చదవడం, రాయడం వచ్చేలా చేయడమే ఏఐ ఉద్దేశమన్నారు. దీంతో విద్యా ప్రమాణాలు మెరుగుపడతాయన్నారు. ప్రభుత్వ పాఠశాలలో 3 నుంచి 5వ తరగతి చదివే విద్యార్థులకు కనీస అభ్యాస సామర్థ్యాలు పెంచేలా ఏఐ సాంకేతికతను వినియోగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. వెనుకబడిన పిల్లలను ఎంపిక చేసి, తెలుగు, ఆంగ్లం బాగా చదివి, రాసేలా, గణిత అంశాల్లో పట్టు సాధించేలా తీర్చిదిద్దుతామని వెల్లడించారు. ఉపాధ్యాయులు వెంకటేశ్ (ఇంగ్లిష్ టీచర్), సి.హెచ్ మహేశ్ (కంప్యూటర్ టీచర్) ఉన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటు శుభపరిణామం

మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్


పాఠశాలలో హైమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్, నాయకులు

కందుకూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో రాత్రి వేళలో సైతం వెలుగులు నింపేలా హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తుండటం శుభపరిణామమని మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్ అన్నారు. బుధవారం సాయంత్రం కందుకూరు జిల్లా పరిషత్ పాఠశాలలో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గ్రామస్తులతో కలిసి ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బొక్క జంగారెడ్డి, పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు బి.ప్రశాంత్‌కుమార్, కె.విష్ణువర్ధన్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల ఆవరణలో..

మండలంలోని కొత్తగూడ పరిధిలో గల కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాల ఆవరణలో రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను బుధవారం గ్రామస్తులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు బొక్క సంజీవరెడ్డి, బొక్క నరేందర్‌రెడ్డి, దామోదర్ రెడ్డి, సొడపు శేఖర్‌గౌడ్ మాట్లాడారు. హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్యే కేఎల్ఆర్‌తో పాటు గ్రామానికి చెందిన బొక్క భూపాల్‌రెడ్డి ఎంతో కృషి చేశారన్నారు. వారికి గ్రామస్తుల తరఫున ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు కుమ్మరి కృష్ణయ్య, సొడపు శంకర్‌గౌడ్, బొక్క దేవేందర్‌రెడ్డి, బొక్క హనుమంత్‌రెడ్డి, ఎండీ ఖదీర్, బొక్క రాజశేఖర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ భార్గవి, ఉపాధ్యాయులు అర్చన, క్లారా, మంజుల, రమాదేవి, ప్రమోద, విమల, విజయలక్ష్మి, అమృత, స్రవంతి పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి నివాళి

మహేశ్వరం: నాగుల్‌దోని తండా పంచాయతీ కార్యదర్శి బోయ సక్కుబాయి రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందడం బాధాకరమని ఎంపీడీఓ శైలజ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద పంచాయతీ కార్యదర్శులు, ఎంపీఓ, సిబ్బందితో కలిసి.. సక్కుబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సక్కుబాయి సక్రమంగా విధులు నిర్వహిస్తూ అందరితో కలివిడిగా ఉండేదన్నారు. ఆమె మరణం తోటి ఉద్యోగులు, తమకు తీరని లోటన్నారు. ఆమెతో పాటు భర్త పాండు చికిత్స పొందుతూ మరణించడం బాధాకరమన్నారు. అనంతరం స్వగ్రామం కల్వకుర్తి మండలం రఘుపతిపేట గ్రామంలో జరిగే అంత్యక్రియలకు పంచాయతీ కార్యదర్శులు తరలి వెళ్లారు. కార్యక్రమంలో ఎంపీఓ రవీందర్‌రెడ్డి, జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం జిల్లా అధ్యక్షుడు పి.శివకుమార్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

బీజేపీ జిల్లా అధ్యక్షుడికి నాయకుల సన్మానం


రాజ్‌భూపాల్‌గౌడ్‌ను సన్మానిస్తున్న కమలనాథులు

యాచారం: బీజేపీ జిల్లా నూతన అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్‌గౌడ్‌ను.. నగరంలోని ఆయన నివాసంలో బుధవారం పార్టీ మండల అధ్యక్షుడు రవీందర్ ఆధ్వర్యంలో శ్రేణులు కలిశారు. శాలువా కప్పి సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో నాయకులు నాగని యాదయ్య, వన్నెవాడ రవీందర్‌రెడ్డి, నుడికుడి కృష్ణ, గౌరిగే బీరప్ప, మేకం ఐలేష్, నీలం రమేష్, మాదం జంగయ్య, సందీప్‌రెడ్డి, కుంటి రాజ్ యాదవ్ పాల్గొన్నారు.

సీసీరోడ్డు నిర్మాణ పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కడ్తాల్: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మండల కేంద్రంలోని మజీద్ సమీపంలో రూ.5 లక్షలు ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపట్టిన సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం అధికారులు, నాయకులు పరిశీలించారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. సీసీ నిర్మాణంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, డీఈ శ్రీనివాస్, ఏఈ పరమేశ్, నాయకులు జహంగీర్‌అలీ, కృష్ణ, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

రాజీవ్ యువ వికాస్‌కు.. దరఖాస్తుల ఆహ్వానం


ఎంపీడీఓ కుసుమ

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న రాజీవ్ యువ వికాసం పథకానికి అర్హులైన వారు ఏప్రిల్ మే 5వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ కుసుమ మాధురి సూచించారు. బుధవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బడుగు బలహీన వర్గాల నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు ఈ పథకం తీసుకువచ్చిందని తెలిపారు. ఈ పథకంలో రూ.50 వేల లోపు యూనిట్‌కు వందశాతం సబ్సిడీ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. రూ.50 వేల నుంచి రూ.లక్ష మధ్య ఉన్న యూనిట్‌కు 90 శాతం, రూ.లక్ష నుంచి రూ.2 లక్షల మధ్య యూనిట్‌కు 80 శాతం, రూ.2 లక్షల నుంచి రూ.4 లక్షల వరకు ఉన్న యూనిట్‌కు 70 శాతం వరకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వనుందని వివరించారు. దరఖాస్తు చేసుకునే వారు ఆధార్, రేషన్‌కార్డు, ఆదాయ, కుల ధృవీకరణ పత్రం, పట్టాదారు పాసుపుస్తకం, సదరన్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోతో వచ్చే నెల 5 లోపు మీ సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న కాపీని సంబంధిత ఎంపీడీఓ కార్యాలయంలో అందించాలని చెప్పారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం


పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు: తలకొండపల్లి మండల కేంద్రంలో రూ.5 లక్షలతో సీసీరోడ్డు నిర్మాణ పనులను బుధవారం పీసీసీ కాంగ్రెస్ సెల్ రాష్ట్ర కార్యదర్శి మోహన్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అజీంలు ప్రారంభించారు. కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సహాయంతో నిర్మాణం చేపట్టామని నాయకులు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు రవీందర్‌యాదవ్, కృష్ణ, మైసయ్య, ఆంజనేయులు, సురేశ్, మహేశ్, జంగయ్య, పవన్, బాబయ్య ఉన్నారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న డైరెక్టర్

ఇబ్రహీంపట్నం: నవోదయ విద్యాలయ ప్రవేశ ఫలితాల్లో ఇబ్రహీంపట్నం యూనివర్సల్ కోచింగ్ సెంటర్ విద్యార్థులు ప్రతిభ చాటారు. ఇక్కడ శిక్షణ పొందిన 14 మంది విద్యార్థులు నవోదయలో సీట్లు పొందారని డైరెక్టర్ బాలరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులకు శాలువా కప్పి సన్మానించి, అభినందనలు తెలిపారు.

బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలి


సమావేశంలో మాట్లాడుతున్న బీసీ నాయకులు

ఆమనగల్లు: రాష్ట్ర ప్రభుత్వం తీసుకు వచ్చిన బీసీ రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని బీసీ సంక్షేమసంఘం తలకొండపల్లి మండల అధ్యక్షుడు గుజ్జరి రాఘవేందర్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల హామీల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి, బిల్లు తెచ్చిందని తెలిపారు. తెచ్చిన బిల్లుకు చట్టబద్ధత కల్పించాల్సిన బాధ్యత కూడా ఆ పార్టీదేనని పేర్కొన్నారు. చట్టబద్ధత బాధ్యతను కేంద్ర ప్రభుత్వంపై నెట్టివేయాలని చూడటం సరైందికాదన్నారు. వెంటనే బిల్లును గవర్నర్ ఆమోదానికి పంపాలని, ఆ తరువాతే గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. రిజర్వేషన్లు పెంచిన తరువాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని సూచించారు. బడ్జెట్‌లో బీసీల అభివృద్ధికి కేవలం రూ.11 వేల కోట్లు మాత్రమే కేటాయించారని, దానిని రూ.20వేల కోట్లకు పెంచాలని పేర్కొన్నారు. బీసీ బంధు అమలు చేయాలన్నారు. దశాబ్దాలుగా బీసీల కోసం పోరాడుతున్న ఆర్.కృష్ణయ్యపై కొందరు విమర్శలు చేస్తున్నారని, అది తగదన్నారు. సమావేశంలో సంఘం మండల ప్రచార కార్యదర్శి నర్సింహగౌడ్, స్వామిగౌడ్, మీడియా ఇన్‌చార్జి కుమార్‌యాదవ్, సభ్యులు శేఖర్, వెంకటయ్య, నాయకులు పాండు, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యం

పీఏసీఎస్ చైర్మన్ రాజేందర్‌రెడ్డి


సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతున్న రాజేందర్‌రెడ్డి

యాచారం: రైతుల ఆర్థిక ప్రగతే లక్ష్యమని పీఏసీఎస్ చైర్మన్ తోటిరెడ్డి రాజేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ ఏడాదికి రూ.27 కోట్ల దీర్ఘకాలిక రుణ బకాయి వసూలు కావాల్సి ఉండగా, సగం కూడ రాలేదని తెలిపారు. మార్చి 30 లోపు బకాయి మొత్తం చెల్లించేలా రైతులు సహకరించాలని కోరారు. రుణాల వసూలు బట్టే, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి రుణం ఇచ్చే అవకాశం ఉంటుందని చెప్పారు. వచ్చే ఖరీఫ్ సీజన్ నుంచి ఎరువులు, విత్తనాలతో పాటు వ్యవసాయ పనిముట్లు అందుబాటులో ఉంచనున్నట్లు వివరించారు. త్వరలో మాల్ కేంద్రంలో నూతన డీసీసీబీ శాఖను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. సమావేశంలో సంఘం డైరెక్టర్లు కంబాలపల్లి మల్లారెడ్డి, స్వరూప, శశికళ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వనమహోత్సవం


ఆమనగల్లు: చింతలపల్లిలో వనభోజనం చేస్తున్న ఓ కుటుంబం


సమావేశంలో మాట్లాడుతున్న వెంకటేశ్‌గుప్తా

ఆమనగల్లు: ఆమనగల్లు మండల పరిధి గ్రామాల ప్రజలు వనభోజన మహోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మంగళపల్లి, చింతలపల్లి, పోలెపల్లి, ఆకుతోటపల్లి ప్రజలు.. సమీప పొలాలు, పండ్ల తోటల్లోని చెట్ల కింద వంటలు వండుకున్నారు. గ్రామ దేవతలకు నైవేద్యం సమర్పించి బంధుమిత్రులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. వనభోజనాలు చేయడం వలన ఆరోగ్యంతో పాటు ప్రకృతిని కాపాడుకున్న వారమవుతామని పలువురు అభిప్రాయపడ్డారు.

అయ్యసాగర క్షేత్రంలో..

కడ్తాల్: మండల పరిధి ముద్విన్ ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో ఆమనగల్లు మండల పరిధి అయ్యసాగర క్షేత్రం ప్రాంగణంలో వనమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్షేత్రంలోని వీరభద్ర స్వామి, శివాలయాలను సందర్శించుకుని పూజలు చేశారు. ఉత్సవానికి డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్‌గుప్తా, ఆర్యవైశ్య సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు అర్థం లక్ష్మయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు గంప శ్రీనివాస్ హాజరయ్యారు. వన భోజనం అనంతరం వెంకటేశ్‌గుప్తా మాట్లాడుతూ.. ముద్విన్‌లోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ నిర్మాణానికి సహకారం అందిస్తానని తెలిపారు. అదే విధంగా కడ్తాల్ మండల కేంద్రంలోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ అభివృద్ధికి తోడ్పాటునందిస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం పొలిటికల్ చైర్మన్ రవికుమార్‌గుప్తా, జిల్లా ఉపాధ్యక్షుడు వాసుదేవ గుప్తా, నాయకులు చింతల వెంకటయ్యగుప్తా, చంద్రయ్యగుప్తా, మురళీ, అమరేశ్, శ్రీను, వెంకటయ్య, చింతల శ్రీను, అర్థం యాదయ్య, బెజవాడ యాదయ్య, మహేశ్, ప్రకాశ్, రమేశ్, అనిల్, రాజు తదితరులు ఉన్నారు.

మండలాన్ని విలీనం చేసేవరకు పోరాటం

ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ రఘుపతి

మహేశ్వరం: మహేశ్వరం మండలాన్ని ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేవరకు ఉద్యమాన్ని ఆపేది లేదని, మరింత ఉధృతం చేస్తామని మహేశ్వరం ఫ్యూచర్ సిటీ జేఏసీ చైర్మన్ వత్తుల రఘుపతి పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కర్నాటి మనోహర్ కాంప్లెక్స్‌లో ఫ్యూచర్ జేఏసీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహేశ్వరం మండలంలోని అన్ని గ్రామాలను ఫ్యూచర్ సిటీలో విలీనం చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి పెంచుతామన్నారు. గ్రామాల్లో పర్యటించి ఫ్యూచర్‌లో విలీనమైతే కలిగే లాభాల గురించి తెలియజేస్తూ ప్రజాభిప్రాయ సేకరణ తీసుకుంటామన్నారు. ఇటీవల మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌తో కలిసి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును జేఏసీ నాయకులందరం కలిసి మండలాన్ని విలీనం చేయాలని కోరామని, ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. అన్ని రాజకీయ, ప్రజా సంఘాలతో కలిసి ఫ్యూచర్ సిటీ జేఏసీ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మహేశ్వరం పేరుతో మహానగరం ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల భాగస్వామ్యంతో పోరాటం ఉధృతం చేస్తామన్నారు.

ఎమ్మెల్యే కసిరెడ్డికి మంత్రి పదవి ఇవ్వాలి

ఆమనగల్లు: కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి మంత్రి వర్గంలో చోటు కల్పించాలని సర్పంచ్‌ల సంఘం మండల మాజీ అధ్యక్షుడు ఎగిరిశెట్టి సత్యం కోరారు. పట్టణంలో బుధవారం ఆయన మాట్లాడుతూ.. విద్యావేత్తగా ఎంతో మందికి విద్యను అందించడంతో పాటు అనేక సేవా కార్యక్రమాలను ఎమ్మెల్యే చేశారని పేర్కొన్నారు. ప్రజాసేవ కోసమే రాజకీయాల్లోకి వచ్చిన ఆయన.. ప్రజల అభిమానంతో శాసన సభ్యుడిగా గెలుపొందారని, ప్రజలకు మరింత సేవ చేయడం కోసం మంత్రిగా అవకాశం ఇవ్వాలన్నారు.

పన్ను అపరాధ రుసుముపై రాయితీ

ఇబ్రహీంపట్నం రూరల్: ఆస్తి పన్ను అపరాధ రుసుముపై 90 శాతం రాయితీ ప్రకటిస్తూ.. ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని ఆదిబట్ల మున్సిపల్ కమిషనర్ బాలకృష్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుర ప్రజలు 2024–25 ఆర్థిక సంవత్సరానికి ఇంటి పన్నును మార్చి 31వ తేదీ లోపుగా చెల్లించి సబ్సిడీ పొందాలని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

రేపు సర్వసభ్య సమావేశం

అబ్దుల్లాపూర్‌మెట్: బాటసింగారం రైతు సేవా సహకార సంఘం సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించనున్నామని సంఘం మేనేజర్ ఐలేష్‌యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. చైర్మన్ భరత్‌కుమార్ అధ్యక్షతన.. కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు సమీక్ష ప్రారంభం కానుందని, సభ్యులు, రైతులు హాజరు కావాలన్నారు.

క్రమబద్ధీకరణకు నాలుగు రోజులే..

- 31తో ముగియనున్న ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు
- ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 14,053 దరఖాస్తులు
- వెయ్యి దరఖాస్తులు క్లియర్, రూ.4 కోట్ల ఆదాయం
- మూడు పురపాలికలకు ఒకే టీపీఓతో ప్రక్రియలో జాప్యం
- ముంచుకొస్తున్న డెడ్‌లైన్.. పెరిగిన రద్దీ


పట్నం మున్సిపల్ కార్యాలయంలో ఎల్ఆర్ఎస్ ప్రక్రియ కేంద్రం

ఇబ్రహీంపట్నం: అనధికార లే అవుట్ల క్రమబద్ధీకరణ(ఎల్ఆర్ఎస్)కు రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈ నెల 31వ తేదీలోగా చేసుకున్న వారికి 25శాతం రాయితీ ప్రకటించింది. ఇచ్చిన గడువు మరో నాలుగు రోజుల్లో ముగియనుండటంతో పుర కార్యాలయానికి అర్జీలు క్యూ కడుతున్నారు. ఇదిలా ఉండగా.. ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో 14,053 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు వచ్చాయి. రుసుం చెల్లింపునకు ప్రత్యేకంగా నాలుగు కౌంటర్లను పుర కార్యాలయంలో ఏర్పాటు చేశారు. సుమారు వెయ్యి దరఖాస్తులు క్లియరెన్స్ కావడంతో రూ.4 కోట్ల వరకు మున్సిపాలిటీకి ఆదాయం సమకూరింది. టీపీఓ(టౌన్ ప్లానింగ్ అధికారి) లాగిన్‌లో మరో వెయ్యి వరకు పెండింగ్‌లో ఉన్నాయి. మున్సిపాలిటీలోనే కాకుండా ఎల్ఆర్ఎస్ యాప్‌లో ఆన్‌లైన్‌లో ఫీజులు కట్టుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించింది.

మొదట్లో అవగాహనలేక

గడువు ముంచుకొస్తుండటంతో ఎల్ఆర్ఎస్ దరఖాస్తుదారులు మున్సిపల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మొదట్లో అవగాహన లేకపోవడం.. ప్లాట్ల క్రమబద్ధీకరణ ఎందుకులే అనుకోవడంతో చాలామంది ఫీజు చెల్లించేందుకు ముందుకు రాలేదు. అంతే కాకుండా మొదట్లో సాంకేతిక సమస్యలు తోడవడం కొంత నెమ్మదించడానికి కారణం. ఈ నేపథ్యంలో మున్సిపల్ సిబ్బంది.. దరఖాస్తుదారులకు ఫోన్లు చేసి, మెసేజ్‌లు పెట్టి అవగాహన కల్పించడంతో ఫీజుల చెల్లింపు ఊపందుకుంది. ఎంత మేర చెల్లించాలో మున్సిపల్ కార్యాలయంలో ఆరా తీస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



అర్హత కలిగిన దరఖాస్తు దారులు 25శాతం రాయితీని సద్వినియోగం చేసుకోవాలి. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు దారులకు ఫీజు చెల్లింపు విషయంలో అవగాహన కల్పించాం. హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేసి, వారి సందేహాలను నివృత్తి చేస్తున్నాం. రాయితీ అవకాశం ఈ నెల 31వ వరకు మాత్రమే ఉంది.

– రవీంద్రసాగర్ మున్సిపల్ కమిషనర్, ఇబ్రహీంపట్నం

మూడు మున్సిపాలిటీలకు ఒకే టీపీఓ

పట్టణ ప్రణాళిక అధికారి ఒక్కరే మూడు మున్సిపాలిటీలకు ఉండటంతో ఎల్ఆర్ఎస్ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. షాద్‌నగర్, తుర్కయంజాల్, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీకి ఒకే టీపీఓ ఉన్నారు. మూడు చోట్ల ఈ ప్రక్రియను చూసుకోవడంలో టీపీఓకు ఇబ్బంది తలెత్తుతోంది. ఒక్క ఇబ్రహీంపట్నం పుర పరిధిలో సుమారు వెయ్యి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు టీపీఓ లాగిన్‌లో క్లియరెన్స్ కాకుండా పెండింగ్‌లో ఉన్నాయంటే సమస్య అర్థం అవుతోంది. వెంటనే దరఖాస్తులు క్లియర్ చేస్తే, మరో రూ.4 కోట్ల ఆదాయం ఎల్ఆర్ఎస్ రూపంలో మున్సిపాలిటీకి సమకూరేది.